క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



అయిజ : క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక ధారుడ్యం కలుగుతుందని మాజీ ఎంపీపీ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. నూతన సంవత్సరం- 2025ను పురస్కరించుకొని మండల కేంద్రంలో శనివారం బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం సాధన చేయడం వలన క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల గుర్తింపునకు సర్వే



కేటీదొడ్డి: లబ్ధిదారుల గుర్తింపునకు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం అధికారులు ఇంటింటా ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేపట్టారు. లబ్ధిదారుడి ఫొటో, భూమి పత్రాల వివరాలు సేకరిస్తున్నారు. అర్హుల జాబితాను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్వాసనతో అవస్థలు



అయిజ: పట్టణంలోని మడ్డి గుంత కాలనీలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మించకపోవడంతో దుర్వాసనతో సతమతమవుతున్నట్లు కాలనీ వాసులు వాపోతున్నారు. పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు వృద్ధి చెంది అనారోగ్యం పాలవుతున్నామన్నారు. మడ్డి గుంత కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని ఎన్నోమార్లు అధికారులు చుట్టూ తిరిగిన పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని కోరుతున్నారు.

చెరువు నీటిని వృథా చేయొద్దు



గట్టు: రైతులు నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ క్యామ వెంకటేష్, నాయకులు రామకృష్ణారెడ్డి, అన్నారు. మండల కేంద్రంలోని గట్టు చెరువు నీటిని వదిలే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి రైతు నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోహన్‌గౌడ్, రాజప్ప, బజారి, హనుమంతురెడ్డి, రంగస్వామి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



అయిజ: రోడ్డుపై వెళ్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తాపడిన ఘటన మానవపాడు మండల కేంద్రంలో శనివారం జరిగింది. కర్నూలు- రాయచూర్ రోడ్డుపై పత్తిలోడుతో వెళ్తుండగా మండలంలోని వెంకటాపురం స్టేజీ సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన సమయంలో డ్రైవర్ రాము మాత్రమే ఉండగా స్వల్పగాయాలతో బయటపడ్డారు.

రెండు బైకులు ఢీ.. ముగ్గురికి తీవ్రగాయాలు

మల్దకల్ : రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం మండలంలోని అమరవాయి గ్రామ పెట్రోల్ బంక్ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు.. అమరవాయి గ్రామానికి చెందిన హనుమంతు, తిమ్మన్న మోటార్ సైకిల్‌పై మల్దకల్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా మల్దకల్ నుంచి అమరవాయి గ్రామానికి చెందిన సురేష్ బైక్‌పై వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హనుమంతును మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

రాబడి ఉన్నా.. అభివృద్ధి లేదు

- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు



మల్దకల్‌లో రోడ్డుపై నిర్వహిస్తున్న సంత

మల్దకల్ : మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే వారాంతపు సంతలో ఆదాయం వస్తున్న సంత మాత్రం అభివృద్ధి చెందడం లేదు. ప్రజాదరణ పొందినా సంతకు వచ్చే వ్యాపారులకు, ప్రజలకు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై సంత నిర్వహించడం, కనీసం మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయలేదంటూ మహిళలు వాపోతున్నారు. సంత నిండా సమస్యలు ఉన్నా నిర్వాహకులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా ప్రసిద్ధి..

మండల కేంద్రంతోపాటు అయిజ, గద్వాల, ఇటిక్యాల, గట్టు తదితర మండలాల నుంచి వందలాదిగా ప్రజలు ప్రతి శనివారం మల్దకల్ సంతకు వచ్చి నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తారు. అంతే కాక గద్వాల జిల్లాలోనే ఎండు మిర్చికి ప్రసిద్ధిగాంచిన ఈ సంతకు జిల్లా నలు మూలల నుంచి కూడా పెద్ద ఎత్తున సంతకు రావడం సర్వసాధారణం. కానీ సంతను రోడ్లపై నిర్వహిస్తుండడంతో వ్యాపారులు, ఇటు ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

ట్రాఫిక్ జాంతో సతమతం..

గ్రామంలోకి పెద్ద వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ జామ్ అయి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. సంతలో తైబజార్ ద్వారా ప్రతి వారం క్రమం తప్పకుండా తైబజార్ వసూళ్లు చేస్తున్నారు కానీ వ్యాపారులకు మాత్రం ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని వాపోతున్నారు. మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, కనీసం కూర్చోవడానికి స్థలం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు రద్దీగా ఉండడంతో ఎక్కడి నుంచి ఏ వాహనం వచ్చి ఢీకొడుతుందోనని భయాందోళన చెందుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సంతలో నెలకొన్న సమస్యలు పరిస్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సౌకర్యాలు లేవు..



ప్రతి శనివారం నిత్యావసర వస్తువులు కొనేందుకు సంతకు వస్తాం. కానీ సంతలో తాగడానికి నీళ్లు కూడా దొరకవు. దూర ప్రాంతం నుంచి ఇక్కడి వచ్చి హోటళ్లలో నీళ్లు తాగుదామంటే హోటల్ యజమానులు నీళ్లు ఇవ్వరు. అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలి.

- సవారమ్మ, అమరవాయి

సంతకు వెళ్లాలంటే భయం..



ప్రతి శనివారం జరిగే మల్దకల్ సంతకు వెళ్లాలంటే భయంగా ఉంది. కానీ తప్పడం లేదు. సంతలో కూరగాయలు, ఇతర వస్తువులు కొనేందుకు వెళ్తుంటాం. కానీ ఎప్పుడు ఏ వాహనం ఢీకొంటుందోనని భయంగా ఉంటుంది. ఇరుకైన రోడ్డుపై సంత జరగడంతో ఇబ్బందిగా ఉంది.

- సుస్మిత, మల్దకల్

తైబజార్ వసూళ్లు మాత్రం చేస్తారు..



ప్రతి శనివారం సంతకు రాగానే తైబజార్ వసూళ్లు ముక్కుపిండి తీసుకుంటారు. కానీ సంతలో ఎలాంటి సౌకర్యాలు నిర్వాహకులు కల్పించడం లేదు. వసూళ్లపై ఉన్న ధ్యాస అధికారులకు సమస్యలు పరిష్కరించడంపై లేదు.

- ఈదన్న, పాల్వాయి

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



గొర్లఖాన్‌దొడ్డిలో నారుమడిని పరిశీలిస్తున్న ఏఓ హనుమంతురెడ్డి



బిజ్వారంలో వరి పంట పరిశీలిస్తున్న ఏడీఏ సక్రియానాయక్

గట్టు : పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి రైతులకు సూచించారు. శనివారం గొర్లఖాన్‌దొడ్డి గ్రామ శివారులో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట, యాసంగి సాగు కోసం సిద్ధం చేసిన వరి నారుమడిని పరిశీలించారు. నారమడుల్లో చలితీవ్రత కారణంగా జింక్ సమస్యలు గుర్తించినట్లు తెలిపారు. నివారణకు లీటర్ నీటిలో రెండు గ్రాముల జింక్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. వరి నాటే ముందు నారుమడుల్లో ఉల్లికూడు, మలి పురుగు, వేరుపురుగు నివారణకు కార్బోఫిరాన్ 3 గులికలను చల్లాలని, నెల వరకు విషపూరితంగా ఉండి, ఎలాంటి రోగాలు బారిన పడుకుండా కాపాడుకోవాలని సూచించారు. మొక్కజొన్నలో లద్దెపురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లీటర్ నీటిలోకి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువుల వాడకంతో లాభాలు

మల్దకల్ : సేంద్రీయ ఎరువుల వాడకంతో రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని ఏడీఏ సక్రియానాయక్ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని బిజ్వారం గ్రామంలో ఇటీవల సాగుచేసిన వరి పంటను ఆయన పరిశీలించారు. రైతులు ఏయే పంటలు సాగుచేశారు, సాగుచేసిన పంటల వివరాలు రికార్డుల్లో పొందుపరిచారా అని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులు వినియోగించాలన్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ముఖ్యంగా రైతులు పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రాజశేఖర్, ఏఈఓ పల్లవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ నల్లారెడ్డి

గట్టు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల విద్యాశాఖ అధికారి నల్లారెడ్డి అన్నారు. మండల స్థాయి బాలల హక్కుల పరిరక్షణ వేదిక శిక్షణ కన్వీనర్ నరేష్ ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలల హక్కులపై అందరికీ అవగాహన ఉండాలని, పిల్లల సంరక్షణ బాధ్యత మన అందరిపై ఉందన్నారు. బాల్యవివాహాలపై సమాచారం తెలిసిన వారు బాలల కమిటీ లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చైల్డ్‌లేబర్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలటౌన్ : గద్వాల అభివృద్ధిలో ఆర్యవైశ్యులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన సంవత్సర క్యాలెండర్- 2025ను శుక్రవారం రాత్రి శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. సామాజిక సేవ కార్యక్రమాల్లో ముందుండే ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు ఆలూరు రాము, బాలస్వామి, సురేష్, నరహరి శ్రీనివాసులు, రత్నాకర్, సుమలత, మధుమతి, రవళి, వెంకటరమణ, మరిడి శ్రీకాంత్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



సీపీఎస్ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు



ధరూరు కేజీబీవీ పాఠశాలలో..

ధరూరు : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, సీపీఎస్ పాఠశాలను ఎంఈఓ రవీంద్రబాబు శనివారం సందర్శించారు. రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం వంట గదిని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థుల హాజరుశాతం, పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ డీఈఓ ప్రత్యేక పూజలు



ధరూరు : మండల పరిధిలోని పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో రిటైర్డ్ డీఈఓ ఓతూరి ఆంజనేయులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం మధ్యాహ్నం ఆయన ఆలయానికి చేరుకుని పూజల్లో పాల్గొన్నట్లు ఆలయ అర్చకులు కిష్టాచార్యులు తెలిపారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు లాంఛనాలతో స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి



గద్వాలటౌన్ : భారత మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్ సింగ్ అకాల మరణంపై అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. శనివారం ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రమోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాధిక, సత్యమ్మ, సురేందర్‌రెడ్డి, భాస్కర్, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

'జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలి'



కమిటీ చైర్మన్లకు సూచనలిస్తున్న జిల్లా అధికారి నరసింహ

శాంతినగర్ : ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని జిల్లా బాలల పర్యవేక్షణ విభాగ అధికారి నరసింహ అన్నారు. వడ్డేపల్లి ఐకేపీ భవనంలో మండల స్థాయి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్ల సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధికారి నరసింహ హాజరై మాట్లాడుతూ.. కమిటీ చైర్మన్లు ప్రతి నిత్యం పాఠశాలలను సందర్శిస్తూ విద్యార్థులు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు గుర్తించాలన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలను గుర్తించి బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు తరగతికి తగిన విద్యా సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు శాతం, గైర్హాజరైన విద్యార్థుల వివరాలు తరచూ సేకరించాలన్నారు. అంతేగాక పాఠశాలల పరిశుభ్రత, పాఠశాలకు వచ్చిన నిధులు సక్రమంగా ఉపయోగించుకునేలా దృష్టి పెట్టాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిని గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభాకర్, కొంకల క్లస్టర్ జీహెచ్‌ఎం అన్వర్‌హాక్, ప్రధానోపాధ్యాయులు పుష్పలత, ఏపీఎం మహేష్, ఏఏపీ చైర్మన్లు శశికల, జానకమ్మ, లక్ష్మిదేవి, నాగమ్మ, సీసీలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కేటీదొడ్డి: సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. మండల పరిధిలోని గువ్వలదిన్నె గ్రామంలో శనివారం రాత్రి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత బ్యాంకింగ్ సేవల వివరాలు అపరిచితులతో పంచుకోవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు. కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాలు ప్రోత్సహించిన వారిపై కేసులు నమోదు చేస్తామని, మహిళలను వేధింపులకు గురిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉద్యోగుల నిరసన



సమ్మె చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

గద్వాలటౌన్ : విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. కేజీబీవీ ఎస్ఓలు, సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్‌ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్‌ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్లకార్డులు చేతబట్టి నినదించారు. ఈ సందర్భంగా పలువురు జేఏసీ నాయకులు మాట్లాడారు. గతేడాది ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు, కేజీబీవీ ఎస్ఓలు, సీఆర్‌టీలు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు మరమ్మతు చేయాలి



అధ్వాన్న స్థితిలో అయిజ-గద్వాల రోడ్డు

అయిజ: మండలంలోని బింగిదొడ్డి సమీపంలోని అయిజ-గద్వాల బీటీ రోడ్డు శిథిలమై ఏళ్లు గడుస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మోకాటిలోతు గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ప్రాణ నష్టం జరుగకముందే అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

'బలిజపల్లి పంచాయతీగానే కొనసాగించాలి'



విలీనం ప్రక్రియకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న బలిజపల్లి గ్రామస్తులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బలిజపల్లి గ్రామాన్ని జంగమాయపల్లి పంచాయతీలో విలీనం చేసేందుకు అధికారులు, పాలకులు తీసుకున్న నిర్ణయాన్ని గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. ఈ విలీనం గ్రామ అభివృద్ధికి విఘాతం కలిగిస్తుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీని విలీనం చేయొద్దంటూ నాలుగు రోజులు వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేయడంతో పాటు రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టారు. శనివారం మండల ప్రత్యేక అధికారి ఎస్.పుష్ప ఆధ్వర్యంలో డివిజనల్ పంచాయతీ అధికారి రఘునాథ్‌రెడ్డి, ఎంపీడీఓ సద్గుణ ఇతర అధికారుల సమక్షంలో ఇరు గ్రామాల గ్రామస్తులతో గ్రామసభ ఏర్పాటు చేశారు. రెండు గ్రామాలను ఒకే గ్రామ పంచాయతీగా ఉండేవిధంగా చూడాలని జంగమాయపల్లి గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మాణం చేయగా.. బలిజపల్లిని జంగమాయపల్లిలో విలీనం చేయకుండా గ్రామ పంచాయతీగానే ఉంచాలని బలిజపల్లి గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మాణం చేశారు. గతంలో జంగామయపల్లి, బలిజపల్లి గ్రామాలు ఒకే పంచాయతీగా ఉండగా, 2018లో బలిజపల్లి ప్రత్యేక గ్రామ పంచాయతీగా మారిందని, అనంతరం గ్రామం ఎంతో అభివృద్ధి చెందిందని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తిరిగి విలీనం చేస్తే గ్రామాభివృద్ధి కుంటుపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానిక ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్త్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయంతి, అశ్వత్థామరెడ్డి, విట్టా శశిధర్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌పై పోలీసుల నజర్

- నిత్యం పరీక్షలు, వాహన తనిఖీలు
- మద్యం తాగి వాహనం నడిపితే కేసులు నమోదు



డ్రంకెన్ డ్రైవ్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు(ఫైల్)

కేటీదొడ్డి: మండల వ్యాప్తంగా డ్రంకన్ డ్రైవ్‌పై పోలీసులు శాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. నిత్యం వాహనాల తనిఖీతో పాటు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేపట్టి మద్యం తాగిన వారిపై కేసులు నమోదు చేస్తుంది. గతంలో మద్యం తాగి వాహనం నడిపితే జరిమానాతో సరిపెట్టేవారు. కానీ ప్రస్తుతం కేసులు నమోదైతే మందు బాబులను జైలుకు తరలిస్తున్నారు. దీంతో మందుబాబులు హడలెత్తిపోతున్నారు. న్యూయర్ వేడుకలు జరుగనున్న నేపథ్యంలో వాహనదారులు నియమాలు పాటించాలని సూచిస్తున్నారు.


మద్యం తాగి రోడ్లపైకి..

మద్యం తాగి వాహనం నడపడం ముప్పని తెలిసినా చాలా మంది తాగి వాహనాలతో రోడ్లపైకి వస్తున్నారు. విందులు, వినోదాల్లో పాల్గొంటూ మత్తు ఎక్కిన తర్వాత కూడా వాహనం నడుపుతున్నారు. దీంతో పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాత్రి వేళల్లో ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. పట్టుబడిన మందు బాబులపై కేసులు నమోదు చేస్తున్నారు. బ్రీత్ ఎనలైజర్‌లో మందుబాబుల బ్లడ్ ఆల్కహాల్ శాతం (బీఏసీ) అధికంగా నమోదవడం చూసి పోలీసులు ఆశ్చర్యపోతున్నారంటే అతిశయోక్తి కాదు. పోలీసులు నిబంధనల ప్రకారం ప్రతీ 100 మి.లీ రక్తంలో బీఏసీ శాతం 30కి మించకూడదు. కానీ బ్రీత్‌ఎనలైజర్ టెస్ట్‌లో మందుబాబులు సెంచరీలు కొడుతున్నారు.

వెంటనే కేసులు నమోదు..

డ్రంకెన్ డ్రైవ్ చేస్తున్నప్పుడు పట్టుబడిన వారిపై పోలీసులు వెంటనే కేసులు నమోదు చేస్తున్నారు. ఎలాంటి పైరవీలకు తావు లేకుండా బ్రీతింగ్ ఎనలైజర్ పరీక్షలు చేసి మద్యం తాగినట్టు తేలగానే వారిపై కేసు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు. మండలంలోని ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 240 మంది మందు బాబులపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మోతాదుకు మించి పట్టుబడిన వారికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తున్నారు. తనిఖీల్లో సరైనా ధ్రువపత్రాలు లేని 2400 మందికి రూ. 4,86,000 జరిమానా విధించారు. తాగి వాహనం నడపడం వలన జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఇతరుల ప్రాణాలకు హాని..



మద్యం మత్తులో వాహనం నడిపితే జీవితాలు ప్రమాదంలో పడడమే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా హాని కలుగుతుంది. ప్రమాదాల నియంత్రణలో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నాం. పట్టుబడిన వారికి కేసు తీవ్రతను బట్టి శిక్షలు విధిస్తున్నారు.

- శ్రీనివాసులు, ఎస్ఐ, కేటీదొడ్డి